క్లుప్తంగా

శ్రీరాముని కల్యాణ వారోత్సవాలు

చిల్లకూరు : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో ఏపీలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో జానకి తెలిపారు. తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయతీలోని గుమ్మడిబ్బ గ్రామంలోని మత్స్యకార కాలనీలో ఉన్న రామాలయంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా సీతారామ కల్యాణం చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయం ఈవో జానకి మాట్లాడుతూ వారం రోజులు తమ్మినపట్నం, లింగవరం, గుమ్మళ్లదిబ్బ కొత్తూరు, వరగలి, మన్నేగుంట, పల్లెవాని దిబ్బ గ్రామాల్లో కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ రవిబాబు

ఓజిలి: మండల ఎస్‌ఐగా రవిబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఆదిలక్ష్మి గుంటూరుకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫ్రెండ్లీ పోలీస్ విధానం అమలు చేస్తామని తెలిపారు.

నేడు వంజివాక సచివాలయం ప్రారంభం

కోట : మండలంలోని వంజివాక గ్రామంలో నిర్మించిన సచివాలయం భవనాన్ని సోమవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయ భవనాన్ని రూ.43 లక్షలతో నిర్మించారు. సచివాలయం ప్రారంభం సందర్భంగా చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో కోట నుంచి వంజివాక వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దొరవారిసత్రం మండలం తనయాలికి చెందిన మొండెం మునిరాజుకు ఆదివారం చిల్లకూరుమండలం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ.25 వేల సాయం అందించారు. అతను నెల్లూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు సాయం చేయాలని ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులును సంప్రదించారు. స్పందించిన ఆయన ట్రస్టు ప్రతినిధులు బాబు, భాస్కర్ ద్వారా రూ.25 వేల నగదును అందజేశారు.

ముత్యాలమ్మకు పూలంగి సేవ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం పూలంగి సేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం పూలంగి సేవ చేపట్టారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో నవీన్ కుమార్ పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం


రూ.50 వేల చెక్కు అందజేస్తున్న సర్వజ్ఞ కుమార యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని మనులాలపేటలో రుద్రమూర్తి మఠం ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమారయాచేంద్ర రూ.50 వేల విరాళం ఇచ్చారు. పోతులూరు వీర బ్రహ్మంగారి శిష్యుడైన రుద్రమూర్తి మనులాలపేట ప్రాంతంలో 385 ఏళ్ల క్రితం జీవ సమాధి చెందారు. అక్కడ స్థానికులు ఆలయం నిర్మించారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్ నిర్మాణ పనులు చేపట్టారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లమ్మగుడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాటబత్తిన చిరంజీవికి ఆర్థిక సాయం చేశారు. వెంకటగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కాలే చెంచునరసింహారావును పరామర్శించారు. పట్టణ అధ్యక్షుడు జి.ఢిల్లీబాబు, 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ, నేతలు రొంటాల చిన్న, గౌరబత్తిన శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏడుగురు కోడి పందెం రాయుళ్ల అరెస్టు

ఓజిలి: మండలంలోని ఇనుగుంట అటవీ ప్రాంతంలో కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఐదు కోళ్లు, రూ.5,500 నగదు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వాహణ
- బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి


విలేజ్ హెల్త్ క్లినిక్

సైదాపురం : మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసి స్థానికంగానే కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా వైద్యులను ఇంటి వద్దకే పంపుతున్నారు. తాజాగా ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు పంచాయతీ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గత నెల 28న ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పేదల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

టాస్క్‌ఫోర్స్ కమిటీ గ్రామీణుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేస్తుంది. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉన్నవారిని గుర్తిస్తుంది. వారికి పౌష్టికాహారం అందేలా చూడడంతోపాటు ప్రజల జీవన శైలి, రోగాల నివారణ, చికిత్సపై అవగాహన కల్పిస్తుంది.

- పాఠశాల విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్‌లో హెల్త్ అంబాసిడర్ పర్యవేక్షిస్తారు. కౌమార దశలోని బాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేస్తారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకుంటారు.
- బాలికలకు శానిటరీ ప్యాడ్ల సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజనం వివరాలను కమిటీ లీడర్లుకు అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల్లో రక్త హీనతపై పర్యవేక్షణ ఉంటుంది. గర్భిణులకు ప్రసవానికి ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా కమిటీ సమన్వయం చేస్తుంది.
- గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటుంది. డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు కమిటీకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటుంది.
- బాల్య వివాహాలను నివారించడంతో పాటు యుక్త వయస్సులో గర్భాలను నిరోధించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలుతోపాటు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు అవగాహన చేపడుతుంది. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

ఆరుగురు సభ్యులతో కమిటీ

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ ఎంఎల్‌హెచ్‌వో) ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశావర్కర్స్, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లోని డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు సభ్యులుగా ఉంటారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి



గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఆరుగురితో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తాం. గ్రామీణులకు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాం. టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుతో గ్రామీణుల అనారోగ్య సమస్యలను పరిష్కరించవచ్చు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూసేందుకు చర్యలు చేపట్టాం.

– పురుషోత్తం శివకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

– జనార్ధన్‌రావు, మండల వైద్యాధికారి, సైదాపురం

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం


వైఎస్సార్ స్మృతి వనంలో వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


నాయుడుపేట వద్ద మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కిలివేటి, సుబ్రమణ్యంరెడ్డి

- పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల ర్యాలీ

నాయుడుపేట టౌన్ : మేనకూరులో వైఎస్సార్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మకు ఆదివారం గ్రామ సరిహద్దు వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి సోదరులు ఘన స్వాగతం పలికారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి స్మృతి వనం వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందన్నారు. కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మేనకూరును పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దివంగత మహానేత వైఎస్సార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా రూ.కోట్లతో వైఎస్సార్ స్మృతి వనం ఏర్పాటు చేసి ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ భవనాలను ఒకే చోట నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తాను టీడీపీలో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

నాయుడుపేటలో..


రిబ్బన్ కట్ చేసి వైఎస్సార్ స్మృతి వనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆదివారం నాయుడుపేట గోమతి సర్కిల్ వద్ద ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి ఘన స్వాగతం పలికారు. అలాగే మేనకూరులో జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ తదితరులు మంత్రికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గ్రీన్‌టెక్ పరిశ్రమ ప్రతినిధులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి

నడకతో సంపూర్ణ ఆరోగ్యం


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు రూరల్ : ప్రతిరోజూ నడక సాగించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. ఆయనను ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ప్రతి రోజూ వేలాది మంది వాకింగ్ చేస్తున్నారని, ఆటలు ఆడుతున్నారని తెలిపారు. అనంతరం సొంత నిధులతో హాకీ క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. అమరావతి ఆస్పత్రి అధినేతలు డాక్టర్ రమణయ్య, నిర్మల సహకారంతో యోగా షీట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు వేగూరు రాజేంద్రప్రసాద్, మునిగిరీష్, నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాపకన్ను కుటుంబంపై దుష్ప్రచారం తగదు


ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాపూరు: మండలంలో 400 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని పాపకన్ను మధుసూదన్‌రెడ్డి కుటుంబంపై చేస్తున్న దుష్ప్రచారం తగదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మినారాయణరెడ్డి ఖండించారు. వారు ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పంగిలిలోని సర్వే నంబర్ 136లో 400 ఎకరాల భూమిని పాపకన్ను మధుసూదన్‌రెడ్డి ఆక్రమించుకున్నట్టు కొన్ని టీవీ చానళ్లలో ప్రసారం చేశారని తెలిపారు. 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న పాపకన్ను మధుసూదన్‌రెడ్డి కుటుంబం ఏనాడూ అక్రమాలకు పాల్పడలేదన్నారు. ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. తప్పుడు వార్తను ప్రసారం చేసిన ఆ చానల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం రాపూరు పోలీస్ స్టేషన్‌లో ఏబీఎన్ చానల్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, లీలాకుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఘని, బాలకృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం


మేనకూరులో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో


చిల్లకూరు : లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్న అధికారులు

నాయుడుపేట: పేదలందరికీ ఇళ్లు పథకం కింద స్థలాలు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయంలో ఆదివారం ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ రిజిస్ట్రేషన్‌లను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో 790 మంది లబ్ధిదారులు వున్నారని చెప్పారు. వారికి వివిధ లేఅవుట్లలో కేటాయించిన స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 300 మందికి డాక్యుమెంట్లను సిద్ధం చేసినట్టు తెలిపారు. మిగిలిన 490 మంది లబ్ధిదారులకు ఈనెల 6లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి హక్కుల పత్రాలు అందజేస్తామన్నారు.

చిల్లకూరు : పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న లేఅవుట్లలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమం మండలంలో చురుగ్గా సాగుతోంది. ఏరూరు గ్రామ సచివాలయంలో ఆదివారం వీఆర్వో రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి చైతన్య సుమారు 18 మంది లబ్ధిదారుల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు అందజేశారు.

గీతా మందిరానికి విరాళం

దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెం గ్రామ పరిధిలోని శ్రీకృష్ణ పరమాత్మ గీతా మందిరం అభివృద్ధికి గ్రామానికి చెందిన వెంకయ్య, వసంత దంపతులు రూ.10 వేలు విరాళం ఇచ్చారు. శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యులు నాగరాజు, సుందరయ్యస్వామి పాల్గొన్నారు.

నేడు సూళ్లూరుపేటలో వైఎస్సార్ ఆసరా సంబరాలు

సూళ్లూరుపేట : పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న ఎంకేఎం కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నట్టుమెప్మా అధికారులు తెలి పారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సూళ్లూరుపేట పట్టణ సమాఖ్య పరిధిలోని అన్ని గ్రూపులకు చెందిన మహిళలు పాల్గొని ముఖ్యమంత్రి జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తారని తెలిపారు.

దారి చూపాలని నిరసన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఓజిలి: మండలంలోని పెదపరియ రాచపాళెంలో మేతపోరంబోకు భూముల్లోకి వెళ్లేందుకు దారి చూపాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో సుమారు 45 ఎకరాల మేతపోరంబోకు భూములు ఉన్నాయన్నారు. వాటిలోకి పశువులు, మేకలు, ఆవులు, గొర్రెలను మేతకు తీసుకెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ శివరామసుబ్బయ్యను వివరణ కోరగా సర్వే నంబర్ 239-4.01 ఎకరాలను ప్రభుత్వం ఒక వ్యక్తికి కేటాయించిందన్నారు. అందులో గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ఉపాధి హామీలో రోడ్డు వేసుకున్నారని, మరో వైపు చెరువులోకి వర్షపు నీరు వెళ్లేందుకు కాలువ ఉందని తెలిపారు. ఈ రోడ్డు ప్రకృతి వనరులను ఆక్రమించకుండా మిగిలిన పొలం సాగు చేసుకోవాలని సంబంధింత వ్యక్తికి నోటీసులు జారీ చేశామని చెప్పారు.

యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన బాన్‌సల్వి

చిల్లకూరు : మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. పున్నపువారిపాళెం సమీపంలో ఉన్న రొయ్యల పరిశ్రమలో అసోంకు చెందిన బాన్ సల్వి పనిచేస్తున్నాడు. అతను ఆదివారం బైక్‌లో గూడూరు వచ్చి తిరిగి పరిశ్రమకు బయలుదేరాడు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నెల్లూరు తరలించారు. పరిశ్రమ ప్రతినిధులు ఆసుపత్రికి చేరుకుని మెరుగైన వైద్యం చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

మాజీ సీఎం నేదురుమల్లి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. బ్యారేజ్ ప్రాంతంలోనే నేదురుమల్లి జనార్ధనరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియడంతో వాకాడు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రామ్‌కుమార్‌రెడ్డి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కొడవలూరు దామోదరరెడ్డి, పాపారెడ్డి రాజశేఖరరెడ్డి, పీ కోటేశ్వరరరెడ్డి, నెల్లూరు పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు సముచిత స్థానం


మైనారిటీ నాయకులతో దేవసేనమ్మ

గూడూరు రూరల్ : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మైనారిటీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ తెలిపారు. పట్టణంలోని ఆమె నివాసంలో ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు కలిశారు. ఇటీవల తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన అజీజ్‌ఖాన్‌ను ఆమె అభినందించారు. అలాగే పట్టణ మైనారిటీ నాయకుడు హాషీంకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. ప్రస్తుతం ఆయన తనయుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందడుగు వేసి మైనారిటీలకు కీలక పదవులు కల్పించారని వివరించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. టవర్ క్లాక్ వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో అహ్మద్‌బాషా, ఆల్తాఫ్, ముబారక్, అస్లాం, రిషద్, కోదండరామయ్య, జమ్మళ్లవాసు, ముని, సాయి, విజయ్, చిన్న, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న రవీంద్రారెడ్డి

రాపూరు: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పథకాలు అందలేదని అర్హులు ఎవరూ బాధపడకూడదని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. ఏవో శివభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు సయీద్ మాట్లాడుతూ రాపూరు ఆర్టీసీ డిపోలో బస్సులు సక్రమంగా నడపడం లేదని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బస్సులు సక్రమంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. డీటీ సురేఖ మాట్లాడుతూ చుక్కల భూములను పట్టా భూములుగా మార్చేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికి కొంత మేరకు పట్టాలు అందించేందుకు సిద్ధం చేశామన్నారు. అలాగే మండలంలో 10 గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్న, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు ప్రసన్న, వైస్ ఎంపీపీలుపెంచలరెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

గూడూరు రూరల్ : ప్రతి ఒక్కరూ కంటి చూపుపై అప్రమత్తంగా ఉండాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. రెండో పట్టణంలో ని నరసింగరావు పేట ప్రాంతంలోని బాలసదనంలో ఆదివారం అరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బాలసదన్‌లోని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాఫా ఐ కేర్ వైద్యులు రూపకళ, హిమబిందు కంటి పరీక్షలు చేశారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ రోహిణి, న్యాయవాదులు, సాయికుమార్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 11.720 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 11.720 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా హెడ్ రెగ్యులేటరీ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.